క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

దుకాణాల్లో చోరీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీ సెంటర్‌లోని పలు దుకాణాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు, సామగ్రి దోచుకెళ్లారు. వివరాలు.. జనార్దన్‌రెడ్డికాలనీ సెంటర్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తున్న అన్సర్ ఆదివారం రాత్రి దుకాణానికి తాళం వేసి తిరిగి సోమవారం ఉదయం దుకాణం తెరిచే సరికి దుకాణం పైన రేకులు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. దుకాణంలో ఉన్న రూ.10 వేల విలువైన సిగరెట్లు, కిళ్లీ సామగ్రితోపాటు రూ.12 వేల నగదును దుండగులు అపహరించినట్లు గుర్తించి నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే ప్రాంతంలో ఓ ఎలక్ట్రికల్ దుకాణం, మరో చిల్లర దుకాణంలో కూడా చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. రోజూ ఈ ప్రాంతంలో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు కొంతమంది యువకులు మద్యం, గంజాయి సేవించి తిరుగుతూ, అవకాశం ఉన్న దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీని పటిష్ట పరిచి రక్షణ కల్పించాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.

శ్రీనివాసుడికి ఊంజల్ సేవ



ఊంజల్‌సేవలో శ్రీవారు, అమ్మవార్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని వెంకటేశ్వరపురంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాలంకరణ, వైభవంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూలంగిసేవ నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి శమీపూజ, ఊంజల్‌సేవ జరిగాయి.

ఇండోర్ సబ్‌స్టేషన్‌లో విజయదశమి పూజలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో నూతనంగా నిర్మించిన ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు పలు విద్యుత్ ఫీడర్లకు ఆయుధపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్‌నగర్ సెక్షన్ విద్యుత్‌శాఖ ఏఈ విజయ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్, జేఎల్‌ఎంలు, ఏఎస్‌ఎంలు, గ్రేడ్–2 ఎనర్జీ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విజయదశమి

ఊరూ.. వాడా.. విజయదశమి పండగను ప్రజలు సోమ, మంగళవారాల్లో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఇళ్లల్లో వాహనాలకు, షాపుల్లో యంత్ర సామగ్రికి పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయాల్లో అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మహిషాసురమర్ధినిగా కామాక్షితాయి అమ్మవారు



పొదలకూరు : విజయలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం విజయదశమి వేడుకలు మిన్నంటాయి. జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అశ్వవాహనసేవ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఏకాంతసేవ వైభవంగా జరిగింది.

మహిషాసురమర్ధినిగా కామాక్షితాయి

జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారు సోమవారం మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేద పండితులు దేవీసప్తశతి, దేవీ భాగవత పారాయణం జరిపించారు. సామూహిక కుంకుమార్చన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మహాలక్ష్మికి పల్లకిసేవ

కొడవలూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నార్లరాజుపాళెంలోని మహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవ అత్యంత వేడుకగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విజయదశమి పర్వదినాన్ని మండలంలో మంగళవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

ఘనంగా..

ఇందుకూరుపేట : విజయదశమి పర్వదినాన్ని మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఇళ్లల్లో ప్రత్యేక పూజలు జరిపి దేవాలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. కొందరు భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు.

మహిషాసురమర్ధినిగా అంకమ్మతల్లి

విడవలూరు : విడవలూరులో కొలువైన అంకమ్మ తల్లి మహిషాసురమర్ధిని అవతారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు గిరి అమ్మవారికి అలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పూండ్ల అచ్యుత్‌రెడ్డి – మాధవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

విజయలక్ష్మిగా అమ్మవారు

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్రనామార్చన, ఖడ్గమాల, త్రిశతి పూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, సెక్రటరీ రాచపూటి రామలింగయ్య పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రాజరాజేశ్వరి, మహిషాసురమర్ధినిగా అమ్మవారు

మనుబోలు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మనుబోలు మండల కేంద్రంలో అమ్మవారు రాజరాజేశ్వరి, మహిషాసురమర్ధిని అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామపురంలోని పోలేరమ్మ గుడి వద్ద అర్చకుడు శ్రీనివాసులు, దసరా చావిడి వద్ద హరికృష్ణ శర్మ అమ్మవారికి రాజరాజేశ్వరి, మహిషాసురమర్ధిని అలంకారాలు చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అలాగే మనుబోలు దసరా చావడి వద్ద అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించి మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కటికాల శ్రీధర్ మహిషాసురమర్ధినిగా, చింతల శ్రీనివాసులు పార్వతిదేవి వేషధారణలో మహిషాసుర సంహార దృశ్యాలను అభినయిస్తూ గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. పొట్టి నాగేంద్ర, పోలంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, బూధాటి సుధాకర్, ఎ.దామోదర్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ముగిసిన ఉత్సవాలు

తోటపల్లిగూడూరు : గత పది రోజులుగా మండలంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. వరిగొండలో వెలసిన జ్వాలాముఖి అమ్మవారి ఆలయం, నరుకూరు ఇందిరాకాలనీలో ఉన్న రాజరాజేశ్వరి ఆలయం, పేడూరులోని చాముండేశ్వరి ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, పూలంగిసేవ, పూర్ణాహుతి హోమాలు జరిగాయి.



పొదలకూరు : అమ్మవారికి పూజలు



మనుబోలు: రాజరాజేశ్వరి అలంకారంలో..



విడవలూరు : మహిషాసురమర్ధిని అలంకారంలో..



మనుబోలు : మహిషాసురుడు, పార్వతీదేవి వేషధారణలు



తోటపల్లిగూడూరు : చిన్నచెరుకూరులో వాహనాలకు పూజలు

నేడు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

పొదలకూరు : మండలంలోని డేగపూడి గ్రామంలో ఉన్న ఎంపీపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు పొదలకూరు కో–లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌రిషిత మంగళవారం తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

నేడు కొత్తవంగల్లులో..

కొడవలూరు : మండలంలోని కొత్తవంగల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఇందులో అన్నిరకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేయడంతో పాటు శస్త్ర చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని సచివాలయ పరిధిలోని వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బుచ్చి ఎస్సై బాధ్యతల స్వీకరణ



బి.మహేంద్ర

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం ఎస్సైగా బి.మహేంద్ర స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది, పలువురు నాయకులు అభినందలు తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా కృషి చేస్తానని తెలిపారు.

పాతకక్షలతో దాడి

వెంకటాచలం : మండలంలోని ఇడిమేపల్లి గ్రామానికి చెందిన చల్లా శీనయ్యపై అదే గ్రామానికి చెందిన చల్లా కిష్టయ్య, చెంచుబాబు, అన్వేష్‌లు మారణాయుధాలతో దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం జరిగింది. చల్లా శీనయ్య, చల్లా కిష్టయ్య మధ్య స్థల వివాదం ఉంది. దీంతో పక్కా ప్రణాళికతో శీనయ్యపై వారు మారణాయుధాలతో దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



భద్రకాళి అమ్మవారి గ్రామోత్సవం



అమ్మవారి సన్నిధిలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో విజయదశమి శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీభద్రకాళి అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారికి గ్రామోత్సవం జరిగింది. ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళా భక్తులు, పిల్లలు సైతం అగ్నిగుండ ప్రవేశం చేసి అమ్మవారి పట్ల తమ భక్తిని చాటుకున్నారు.

ఆలయానికి వంట సామగ్రి వితరణ

మనుబోలు : మనుబోలులోని విష్ణాలయానికి దాతలు మంగళవారం వంట సామగ్రిని వితరణ చేశారు. దేవాలయంలో ప్రతి నెలా ఏకాదశి రోజున అన్నదానం చేస్తారు. ఇందులో భాగంగా వంట తయారీకి అవసరమైన సామగ్రిని పలువురు దాతలు అందజేశారని ఆలయ అర్చకుడు హనుమాచార్యులు తెలిపారు. బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి–జానకి దంపతులు రూ.15 వేలు, రిటైర్డ్ వీఆర్వో ఉపేంద్ర రూ.15 వేలు, డీ మార్ట్ నిర్వాహకుడు ధనుంజయరెడ్డి రూ.5 వేలు ఇలా మరికొంత మంది ఇచ్చిన విరాళాలతో వంట సామగ్రిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం వంటి సామగ్రిని దాతలు అర్చకులకు అందజేశారు.



దేవాలయాల నిర్మాణానికి ప్రత్యేక కృషి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వెంకటేశ్వరస్వామి ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : గ్రామాల్లో ప్రజల ఆకాంక్ష మేరకు దేవాలయాలను నిర్మించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కసుమూరు గిరిజన కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి సోమవారం సందర్శించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.10 లక్షలతో స్థానికంగా వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించడంతో కాలనీ వాసులు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పాటు, దేవాలయాలను నిర్మించాలన్న ప్రజల కోరికను నెరవేర్చేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కసుమూరు గిరిజనకాలనీలో దేవాలయ నిర్మాణానికి సహకరించిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తానన్నారు. నిరంతరం గ్రామాల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, సర్పంచ్ కడివేటి శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు చీకుర్తి నరసయ్య, హుస్సేన్, గుర్రం పుట్టయ్య, శేషయ్య, మందా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలహారం బహూకరణ



ముత్యాలహారాన్ని అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారికి వైఎస్సార్ జిల్లా రైల్వేకోడూరుకు చెందిన తోట శివసాయి దంపతులు సోమవారం రూ.10 లక్షల విలువ చేసే ముత్యాలహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ ఆలయ మర్యాదలతో దాతలను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అన్నదానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రేబాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత చిరమన సురేష్ విజయదశమి సందర్భంగా మంగళవారం 300 మంది కార్మికులకు అన్నదానం చేశారు. అనంతరం స్వీట్స్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా వేడుకలను కార్మికులతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

నృత్య కళాకారులకు బహుమతుల ప్రదానం

కొడవలూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో 'మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమి' ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన జరిగింది. ఈ బృందంలోని చిన్నారులు అబ్బుర పరిచే నాట్య ప్రదర్శన చేయడాన్ని ప్రశంసిస్తూ కొడవలూరుకు చెందిన నేతాజీ అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కోవూరు వెంకి బృందంలోని చిన్నారులకు బహుమతులు అందజేశారు.



బహుమతులతో కళాకారుల బృందం

భక్తితో మహాసమాధి మహోత్సవాలు

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో మహాసమాధి మహోత్సవాలను మంగళవారం భక్తితో నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు కాకడ హారతి, 6.30కి స్వామికి పంచామృత అభిషేకం, 8 గంటలకు సహస్రనామ పూజలు, 9 గంటలకు సామూహిక ధుని పూజలు, 11 గంటలకు స్తవనమంజరి పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, తీర్థప్రసాద వినియోగం, రాత్రి 7 గంటలకు లక్ష్మీ అష్టోత్తర స్తోత్రం, విష్ణు సహస్రనామ స్తోత్రం, సామూహిక పారాయణం, 7 గంటలకు నెల్లూరు వారిచే భక్తిపాటలు, రాత్రి శేజ్‌హారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. మందిర సేవాసమితి సొసైటీ వారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నిత్యాన్నదాన భవనం ప్రారంభం

పొదలకూరు : మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో ఉన్న ఆదిపరాశక్తి కాంతమ్మ తల్లి ఆశ్రమంలో పులిమి వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన నిత్యాన్నదాన భవనాన్ని పులిమి నరేంద్ర–మోహనలత దంపతులు మంగళవారం ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు సుబ్బారెడ్డిస్వామి, మురళీరెడ్డి దంపతులు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన భవనాన్ని ప్రారంభించిన దాతలు

గ్రామీణ లింకు రోడ్డుకు మోక్షం

- పలు గ్రామాలకు అనువైన మార్గం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాకారం



నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న చాటగొట్ల–బిరదవోలు రోడ్డు

పొదలకూరు : మూడు దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోని గ్రామీణ లింకురోడ్డుకు మోక్షం కలిగింది. దాదాపు 16 గ్రామాలకు అనుసంధానంగా మనుబోలు, పొదలకూరు, సైదాపురం మండలాల గ్రామాలకు లింకురోడ్డుగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఈ రోడ్డును దశాబ్దాలుగా పట్టించుకోకుండా వదిలేశారు. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రాధాన్యతను గుర్తించి సీఎంఎఫ్ నిధులను మంజూరు చేయించి వేగంగా రోడ్డు పనులను చేయించారు. దీంతో ప్రస్తుతం చక్కటి తారురోడ్డు నిర్మాణం పూర్తి చేసుకుంది.

ఎంతో ఉపయోగం

పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో రూ.2.60 కోట్లతో నెల్లూరు–పొదలకూరు రోడ్డు నుంచి చాటగొట్లకు సమీపంలో బిరదవోలు రోడ్డు పనులు చేపట్టారు. మనబోలు–పొదలకూరు మార్గం నుంచి నెల్లూరు వెళ్లాలంటే పొదలకూరు పట్టణంతో పనిలేకుండా దగ్గర మార్గంలో కొత్తరోడ్డుపై వెళితే సుమారు 10 కిలోమీటర్ల దూరం తగ్గిపోతుంది. మండలంలోని బిరదవోలు, బ్రాహ్మణపల్లి, ముత్యాలపేట, కల్యాణపురం, చెర్లోపల్లి, పార్లపల్లి, మనుబోలు మండలం అక్కంపేట, గొట్లపాళెం, వడ్లపూడి, బండేపల్లి, మడమనూరు, సైదాపురం మండలం కట్టుముడిపల్లి, మలిచేడు, దేవరవేమూరు తదితర గ్రామ ప్రజలు దగ్గర మార్గం గుండా నెల్లూరుకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. సుమారు 3 కిలోమీటర్ల పైబడి దూరం కలిగిన మార్గంలో తారురోడ్డును నిర్మించారు. త్వరలో ఈ రోడ్డును మంత్రి కాకాణి ప్రారంభించనున్నారు. మార్గమధ్యలో కల్వర్టుల నిర్మాణం కూడా పూర్తిచేశారు. ప్రస్తుతం ఈ మార్గం కీలకంగా మారింది. ఇన్ని గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా మారనున్న రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన మంత్రి కాకాణికి ఆయా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.